క్లుప్తంగా

అభివృద్ధి పనుల పరిశీలన

జిన్నారం(పటాన్‌చెరు): మండల పరిధిలోని బొల్లారం మున్సిపల్ పరిధిలోని ఆయా కాలనీలలో చేపడుతున్న యూజీడీ నిర్మాణ పనులను గురువారం మాజీ జెడ్పీటీసీ బాల్‌రెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పనులను నాణ్యతగా చేపట్టాలని సంబంధిత అధికారులు, కాంట్రాక్టర్లకు సూచించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మున్సిపల్ అధ్యక్షుడు హన్మంత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మెరుగైన విద్యను అందించండి



బడిబాట కార్యక్రమంలో పాల్గొన్న మున్సిపల్ చైర్‌పర్సన్ రోజారాణి

జిన్నారం(పటాన్‌చెరు): విద్యార్థులకు మెరుగైన విద్యను అందించాలని బొల్లారం మున్సిపల్ చైర్‌పర్సన్ రోజారాణి అన్నారు. బొల్లారం మున్సిపల్ పరిధిలోని బీసీ కాలనీలో ఉన్న ప్రభుత్వ పాఠశాలలో బడిబాట కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతిఒక్కరూ తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించేవిధంగా తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలని సూచించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

దాతల సేవలు మరువలేనివి

సదాశివపేట రూరల్(సంగారెడ్డి): ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధిలో దాతల సేవలు మరువలేనివని మండల నోడల్ అధికారి పులిమామిడి సుధాకర్ అన్నారు. మండల పరిధిలోని నాగులపల్లి ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు ఉపాధ్యాయుడు ప్రవీణ్‌కుమార్ తన సొంత ఖర్చులతో ఉచితంగా నోట్ పుస్తకాలు, పలకలు, రాత సామగ్రిని గురువారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మండల నోడల్ అధికారి మాట్లాడుతూ దాతలు అందిస్తున్న సహకారాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకొని చదువుల్లో రాణించాలని సూచించారు. దాతలు ముందుకు వచ్చి ప్రభుత్వ పాఠశాల అభివృద్ధిలో భాగస్వాములు కావాలని కోరారు. అనంతరం ఉపాధ్యాయుడు ప్రవీణ్ కుమార్‌ను అభినందించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు జయకృష్ణ, అమ్మ ఆదర్శ పాఠశాల చైర్మన్ సంగీత, సీఆర్పీ మల్లేశం, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

నందిగామ గ్రామ కార్యదర్శిగా రిజ్వాన్

పటాన్‌చెరు టౌన్: మండల పరిధిలోని నందిగామ, పాశమైలారం గ్రామ పంచాయతీ కార్యదర్శులు బదిలీ అయ్యారు. నందిగామ గ్రామ కార్యదర్శి ఇటీవలే పదవీ విరమణ పొందిన విషయం తెలిసిందే. దీంతో ఖాళీగా ఉన్న స్థానంలో పాశమైలారం గ్రామ పంచాయతీ కార్యదర్శిగా విధులు నిర్వహిస్తున్న రిజ్వాన్ నందిగామ కార్యదర్శిగా బాధ్యతలు స్వీకరించారు. కాగా కోహీర్ గ్రామ పంచాయతీ కార్యదర్శిగా విధులు నిర్వహిస్తున్న లక్ష్మణచారి పాశమైలారం గ్రామపంచాయతీ కార్యదర్శిగా బాధ్యతలు చేపట్టారు.

వీధికుక్కల సంచారాన్ని అరికట్టండి

సంగారెడ్డి: వీధికుక్కల బెడద నుంచి ప్రాణాలు కాపాడాలని పట్టణ పరిధిలోని ఆదిత్యనగర్ కాలనీవాసులు మున్సిపల్ కమిషనర్ ప్రసాద్ చౌహాన్‌కు గురువారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా కాలనీ అధ్యక్షుడు సాయిలు మాట్లాడుతూ కాలనీలో వీధికుక్కల వలన ప్రజలు పిల్లలు బయటకు రాలేని పరిస్థితి ఉందన్నారు. రెండు రోజుల క్రితం ఎనిమిదేళ్ల బాలుడిపై, అదేవిధంగా మహిళలపై గుంపులుగా వచ్చి దాడి చేసి తీవ్రంగా గాయపరిచాయని వాపోయారు. పిల్లలు స్కూల్‌కు వెళ్లాలంటే భయపడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. అధికారులు వెంటనే స్పందించి వీధికుక్కల బెడద నుంచి కాపాడాలని కోరారు. వినతిపత్రం అందజేసినవారిలో కాలనీవాసులు వేణుగోపాల్, రాజేంద్రప్రసాద్, లక్ష్మణ్, గోపాల్‌గౌడ్, హేమంత్‌కుమార్, సంతోష్, రవి, కిరణ్, ఆలీ పాల్గొన్నారు.

విద్యార్థులకు వైద్య పరీక్షలు



విద్యార్థులకు వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్లు

సదాశివపేట రూరల్(సంగారెడ్డి): మండల పరిధిలోని నిజాంపూర్(కే)ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు గురువారం రాష్ట్రీయ బాల స్వాస్థ్య కార్యక్రమంలో భాగంగా మెడికల్ అధికారి డాక్టర్ గౌరీశంకర్ ఆధ్వర్యంలో వైద్య పరీక్షలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి విద్యార్థి ఆరోగ్యంగా ఉండాలంటే పోషకాహారాన్ని తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు రామకృష్ణ, ఉపాధ్యాయులు నవనీత, సునీత పాల్గొన్నారు.



మూతపడిన మల్‌చెల్మ హైస్కూల్ భవనం



శిథిలమైన తరగతి గది



పెచ్చులూడిన తరగతి గోడ

శిథిలమై.. మూతబడి

- నూతన పాఠశాల భవనం నిర్మించడంలో అధికారుల నిర్లక్ష్యం
- పెచ్చులూడుతున్న పైకప్పులు
- షిప్టు పద్ధతిలో తరగతుల నిర్వహణ
- భయాందోళనలో ఉపాధ్యాయులు, విద్యార్థులు

దశాబ్దాల క్రితం నిర్మించిన పాఠశాల భవనం శిథిలమైంది. తరగతి గదుల స్లాబ్ పెచ్చులు ఊడి కింద పడుతున్నాయి. దీంతో భయం భయంతోనే ఇనాళ్లు ఉపాధ్యాయులు విద్యాబోధన చేశారు. ఏదైనా ప్రమాదం చోటుచేసుకొని తరగతి గదులు కూలుతాయోనని భయాందోళనలో స్కూల్‌ను మూసి వేశారు. ప్రైమరీ పాఠశాల బిల్డింగ్‌లోకి స్కూల్‌ను మార్చి షిఫ్టు పద్ధతిలో తరగతులను నిర్వహిస్తున్నారు. విద్యా బోధనకు ఇబ్బందులు తలెత్తడమే కాకుండా విద్యాప్రమాణాలు తగ్గి విద్యార్థులు తీవ్రంగా నష్టపోతున్నారు. పాఠశాల భవనం శిథిలం కావడంతో కొత్త బిల్డింగ్ కోసం నిధులు సైతం మంజూరయ్యాయి. కానీ ఇంతవరకూ నూతన భవన పనులను ప్రారంభించకపోవడంతో విద్యావ్యవస్థపై పాలకులకు ఉన్న వైఖరి ఏమిటో అర్థమవుతోంది.

– జహీరాబాద్ టౌన్

జహీరాబాద్ మండల పరిధిలోని మల్‌చెల్మ రాజకీయ భీష్మపితామహుడిగా పిలిచే దివంగత మాజీ మంత్రి, ఎంపీ, ఎమ్మెల్యే బాగారెడ్డి స్వగ్రామం. 1969లో గ్రామంలో ఉన్నత పాఠశాల భవనం నిర్మించారు. 6నుంచి 10వ తరగతి వరకు తెలుగు, ఉర్దూ మీడియంలో విద్యా బోధన జరుగుతోంది. రెండు మీడియంలు కలిపి 240 మంది విద్యార్థులు ఉన్నారు. పాఠశాలలో 16 గదులు ఉండగా వాటిలో 14 గదులు పూర్తిగా దెబ్బతిని శిథిలమయ్యాయి.

భయాందోళన మధ్య విద్యాబోధన

భవనం గోడలు బీటలు వారి పైకప్పు పెచ్చులు ఊడి కూలడంతో భయం భయంతో ఉపాధ్యాయులు తరగతులు బోధి వర్షం కురిస్తే చాలు తరగతి గదుల్లో నీరు వచ్చి చేరుతోంది. దీంతో ప్రమాదం పొంచి ఉందని గ్రహించి ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు హైస్కూల్‌ను ప్రాథమిక పాఠశాల భవనంలోకి షిఫ్టు చేశారు. మూడేళ్ల నుంచి షిఫ్టు పద్ధతిలోనే తరగతుల నిర్వహణ కొనసాగుతోంది. ఉదయం 12.30 గంటల వరకు ప్రైమరీ, మధ్యాహ్నం 1గంట నుంచి సాయంత్రం 5గంటల వరకు ఉన్నత పాఠశాల తరగతులను బోధిస్తున్నారు.

విద్యార్థులకు తప్పని తిప్పలు

షిఫ్టు పద్ధతిలో పాఠాలు బోధిస్తుండటంతో విద్యార్థులకు తిప్పలు తప్పడం లేదు. సమయం తక్కువగా ఉండటం ద్వారా పాఠాలు అర్థం కావడంలేదని విద్యార్థులు వాపోతున్నారు. హైస్కూల్ విద్యార్థుల పరిస్థితి ఇలా ఉంటే ప్రైమరీ స్కూల్‌కు ఒంటిపూట బడి ఉండటంతో మధ్యాహ్నం నుంచి పిల్లలు ఇంటి వద్దనే ఉంటున్నారని, దీంతో చదవుపై శ్రద్ధ చూపడంలేదని తల్లిదండ్రులు వాపోతున్నారు.

అధికారుల నిర్లక్ష్యంతో నిధులు వెనక్కి..

మాజీ సీఎం కిరణ్‌కుమార్‌రెడ్డి 2012లో మల్‌చెల్మ గ్రామానికి వచ్చారు. ఈ సందర్భంగా అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొని హైస్కూల్‌కు నూతన భవనం కోసం రూ.2 కోట్లు మంజూరు చేశారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోనే పాఠశాల ఆదర్శంగా నిలిచేలా నిర్మించాలని అప్పట్లో ఆయన అధికారులను ఆదేశించారు. ఈ మేరకు అధికారులు గ్రామ పరిధిలో ఉన్న రెండెకరాల ప్రభుత్వ స్థలాన్ని పాఠశాల నిర్మాణం కోసం ఎంపిక చేశారు. ఆ తర్వాత ఏ కారణం చేతనో నిర్మాణ పనులకు ఇంతవరకూ శ్రీకారం చుట్టలేదు. అధికారుల నిర్లక్ష్యంతో మంజూరైన నిధులు ల్యాప్స్ అయ్యాయి. ఆ తరువాత పాఠశాల గురించి పట్టించుకునే నాథుడు కరువయ్యాడని స్థానిక ప్రజలు వాపోతున్నారు. గత ప్రభుత్వ హయంలో మన ఊరు–మనబడి కార్యక్రమంలో భాగంగా పాఠశాల భవనాలకు నిధులు మంజూరయ్యాయి. కానీ శిథిలావస్థకు చేరుకొని మూతబడిన మల్‌చెల్మ ఉన్నత పాఠశాలకు నిధులు కేటాయించలేదు. ఇప్పటికైనా కలెక్టర్ ప్రత్యేక శ్రద్ధ తీసుకొని పాఠశాల భవనం నిర్మించాలని విద్యార్థుల తల్లిదండ్రులు, స్థానికులు కోరుతున్నారు.

ప్రతిపాదనలు పంపాం

మల్‌చెల్మ ఉన్నత పాఠశాల భవనం శిథిలమైనందున ప్రైమరీ స్కూల్‌లో షిఫ్టు పద్ధతిలో తరగతులను బోధిస్తున్నాం. నూతన భవన నిర్మాణం కోసం మన ఊరు–మనబడి కార్యక్రమంలో భాగంగా డీఈఓ ప్రభుత్వాన్నికి ప్రతిపాదనలు పంపారు. కానీ.. నిధులు ఇప్పటివరకూ మంజూరు కాలేదు. నిధులు మంజూరు కాగానే పాఠశాల భవనం నిర్మిస్తాం.

– బస్వరాజ్, ఎంఈఓ, జహీరాబాద్

బాధిత కుటుంబాన్ని ఆదుకుంటాం

మంత్రి దామోదర రాజనర్సింహా



చంద్రశేఖర్ మృతదేహానికి మంత్రి దామోదర రాజనర్సింహ నివాళి

పుల్‌కల్(అందోల్): ఇటీవల విద్యుదాఘాతానికి గురై మృతి చెందిన విద్యుత్ లైన్‌మెన్ కుటుంబాన్ని అన్నివిధాలుగా ఆదుకుంటామని వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ అన్నారు. మండల పరిధిలోని పెద్దారెడ్డిపేట గ్రామానికి చెందిన చంద్రశేఖర్ జేఎల్ఎంగా విధులు నిర్వర్తిస్తూ బుధవారం విద్యుదాఘాతానికి గురై మృతి చెందిన విషయం తెలిసిందే.. పోస్టుమార్టం అనంతరం గురువారం నిర్వహించిన చంద్రశేఖర్ అంత్యక్రియలకు మంత్రి దామోదర హాజరై చంద్రశేఖర్ మృతదేహానికి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మృతుడి కుటుంబానికి ప్రభుత్వం నుంచి రూ.15లక్షలు, మంత్రి స్వయంగా రూ.5లక్షలతో పాటు కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం ఇప్పిస్తామని హామీనిచ్చారు.

కరపత్రాలు విడుదల

జహీరాబాద్ టౌన్: జిల్లా కేంద్రమైన సంగారెడ్డిలో ఈ నెల 6వ తేదీ నుంచి ప్రారంభం కానున్న పీడీఎస్‌యూ రాష్ట్ర జనరల్ కౌన్సిల్ సమావేశాల కరపత్రాలను ఆ సంఘం నాయకులు గురువారం విడుదల చేశారు. ఈ సందర్భంగా పీడీఎస్‌యూ జిల్లా కార్యదర్శి నర్సింహారెడ్డి మాట్లాడుతూ రెండు రోజుల పాటు కౌన్సిల్ సమావేశాలు కొనసాగుతాయన్నారు. విద్యారంగ సమస్యల పరిష్కారంపై సమావేశాల్లో చర్చిస్తారని తెలిపారు. సంఘం నాయకులు పాల్గొన్నారు.

దొడ్డి కొమురయ్యకు నివాళి

సంగారెడ్డి: తెలంగాణ ఉద్యమ తొలి అమరుడు దొడ్డి కొమురయ్య త్యాగం మరువలేనిదని మెదక్ ఎంపీ రఘునందన్‌రావు అన్నారు. కొమురయ్య 78వ వర్ధంతిని జిల్లా కురుమ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ క్రాంతి, అదనపు కలెక్టర్ చంద్రశేఖర్‌తో కలిసి దొడ్డి కొమురయ్య విగ్రహానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఆర్‌సీ పురం కార్పొరేటర్ పుష్ప, మునిపల్లి జెడ్పీటీసీ మీనాక్షి, ఓబీసీ సంఘం ఉపాధ్యక్షుడు పాండు, జిల్లా యూత్ అధ్యక్షుడు ప్రవీణ్, రాములు, భూమయ్య, గోకుల్‌కృష్ణ, నాగేష్, రవీందర్, ఈశ్వర్, యాదగిరి, సోమశేఖర్ పాల్గొన్నారు.

వట్‌పల్లి మండల కేంద్రంలో...



వట్‌పల్లి: దొడ్డి కొమురయ్య చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

వట్‌పల్లి(అందోల్): తెలంగాణ సాయుధ పోరాటంలో తొలి అమరుడైన దొడ్డి కొమురయ్య వర్ధంతిని మండల కేంద్రంలో గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా దొడ్డి కొమురయ్య చిత్రపటానికి నివాళులర్పించారు. అనంతరం పలువురు నాయకులు మాట్లాడుతూ నిజాం నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా పోరాడి అమరుడైన దొడ్డి కొమురయ్య త్యాగం ఎందరికో స్ఫూర్తిదాయకమని కొనియాడారు. కార్యక్రమంలో కురుమ యువత మండల అధ్యక్షుడు మహేష్, నియోజకవర్గ ఉపాధ్యక్షుడు మల్లయ్య, పీఏసీఎస్ డైరెక్టర్ బుద్ధిరెడ్డి, రాజు, మల్లేశం, శ్రీను, చందు, నర్సింహులు, బాబు పాల్గొన్నారు.

సీపీఐ(ఎం) జిల్లా కమిటీ ఆధ్వర్యంలో...

సంగారెడ్డి టౌన్: తెలంగాణ సాయుధ పోరాట అమరుడు దొడ్డి కొమరయ్య వర్ధంతిని సీపీఐ(ఎం) జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఆ పార్టీ కార్యాలయంలో గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు అతిమేల మాణిక్ మాట్లాడుతూ జమీందార్లు, దేశ్‌ముఖ్‌ల ఆగడాలను అంతమొందించిన గొప్ప పోరాట యోధుడు దొడ్డి కొమురయ్య అని కొనియాడారు. కార్యక్రమంలో ఆ పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు సాయిలు, నాయకులు రాజయ్య, కృష్ణ, వాణి తదితరులు పాల్గొన్నారు.

నారాయణఖేడ్ మండలంలో...



నారాయణఖేడ్: దొడ్డి కొమురయ్య విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

నారాయణఖేడ్: మండల పరిధిలోని జూకల్ శివారులో ఉన్న డబుల్‌బెడ్‌రూం ఇళ్ల సమీపంలోని గురువారం కురుమ సంఘం ఆధ్వర్యంలో దొడ్డి కొమురయ్య వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా దొడ్డి కొమురయ్య విగ్రహానికి నివాళులర్పించారు. డీసీసీ ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్‌రెడ్డి, కురుమ సంఘం ఖేడ్ నియోజకవర్గ అధ్యక్షుడు ప్రభాకర్, ఉపాధ్యక్షుడు మల్గొండ, కురుమ సంఘం బాధ్యులు అంజన్న, సంతోష్, దత్తు, నర్సింహులు, బీరప్ప, జైపాల్, కృష్ణ, మల్లేష్, తుకారం, రమేష్, మాజీ ఎంపీటీసీ పండరి రెడ్డి పాల్గొన్నారు.

విద్యాసంస్థల బంద్ విజయవంతం



నారాయణఖేడ్: విద్యార్థులతో ప్రదర్శన నిర్వహిస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు, విద్యార్థులు

నీట్ పరీక్షను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ ఎస్ఎఫ్ఐ, ఏఐఎస్ఎఫ్, ఏఐఎఫ్ఎస్, ఎన్ఎస్‌యూఐ, డీవైఎఫ్ఐ సంఘాలు ఇచ్చిన దేశవ్యాప్త పిలుపులో భాగంగా గురువారం జిల్లావ్యాప్తంగా నిర్వహించిన విద్యాసంస్థల బంద్ గురువారం విజయవంతమైంది. ఈ సందర్భంగా ఆయా సంఘాల నాయకులు మాట్లాడుతూ నీట్ ప్రశ్నా పత్రాల లీకేజీపై కేంద్ర ప్రభుత్వం మౌనం వీడి సుప్రీంకోర్టు న్యాయమూర్తి చేత విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో ఆందోళనలను ఉధృతం చేస్తామని హెచ్చరించారు.



జహీరాబాద్ టౌన్: జూనియర్ కళాశాలలో తరగతులను బహిష్కరిస్తున్న నాయకులు

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

పటాన్‌చెరు టౌన్: చికిత్స పొందుతూ గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందాడు. అమీన్‌పూర్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండల పరిధిలోని గండిగూడెం కాలనీ సమీపంలో ఉన్న ఓఆర్ఆర్ సర్వీస్ రోడ్డు నుంచి గత నెల 21వ తేదీ రాత్రి నడుచుకుంటూ వెళ్తున్న వ్యక్తిని ద్విచక్ర వాహనం ఢీకొట్టింది. దీంతో గాయపడిన వ్యక్తిని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అనంతరం మెరుగైన చికిత్స కోసం అక్కడి నుంచి గాంధీ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ గురువారం మృతి చెందాడు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

ఘనంగా వివేకానంద వర్ధంతి



స్వామి వివేకానంద విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న కార్పొరేటర్, బీఆర్ఎస్ శ్రేణులు

పటాన్‌చెరు టౌన్: స్వామి వివేకానంద వర్ధంతి పురస్కరించుకుని పట్టణంలోని బస్టాండ్ సమీపంలో ఉన్న స్వామి వివేకానంద విగ్రహానికి బీఆర్ఎస్ శ్రేణులతో కలిసి కార్పొరేటర్ మెట్టు కుమార్‌యాదవ్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ డివిజన్ అధ్యక్షుడు అఫ్జల్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కల్యాణ మండపం పరిశీలన

రామచంద్రాపురం (పటాన్‌చెరు): తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని వెలిమెల తండాలో గురువారం మున్సిపల్ వైస్‌చైర్మన్ రాములుగౌడ్ పర్యటించారు. ఈ సందర్భంగా తండాలో నూతనంగా నిర్మించిన కల్యాణ మండపాన్ని పరిశీలించారు. మున్సిపల్ కమిషనర్ సంగారెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

అనారోగ్యంతో ఉద్యమకారుడు మృతి



ప్రభాకర్

హత్నూర(సంగారెడ్డి): మండల పరిధిలోని బోరుపట్ల గ్రామానికి చెందిన తెలంగాణ మలిదశ ఉద్యమకారుడు గూడాల ప్రభాకర్ బుధవారం రాత్రి అనారోగ్యంతో మృతి చెందాడు. ప్రత్యేక తెలంగాణ మలిదశ ఉద్యమంలో ప్రభాకర్ ఉత్సాహంగా పనిచేయగా, పోలీసు కేసులు నమోదయ్యాయి. ప్రభాకర్ కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని గ్రామస్తులు కోరారు.

ట్రిపుల్ ఐటీకి విద్యార్థుల ఎంపిక

వట్‌పల్లి(అందోల్): అందోలు మండల పరిధిలోని అక్సాన్‌పల్లి మోడల్ పాఠశాలకు చెందిన ఆరుగురు విద్యార్థులు, వట్‌పల్లి మండలంలోని పోతులబోగుడా మోడల్ పాఠశాలకు చెందిన ముగ్గురు విద్యార్థులు బాసర ట్రిపుల్ ఐటీకి ఎంపికైనట్లు ప్రిన్సిపాల్స్ ప్రభాకర్, మల్లీక తెలిపారు. అక్సాన్‌పల్లి పాఠశాల నుంచి విఠలేశ్వర్, జ్యోత్స్న, హుమాబేగం, అక్షర, అశ్విని, మల్లికార్జున్‌రెడ్డి, పోతులబోగుడా పాఠశాల నుంచి శైలజ, తహినీయత్, మయూరీ ఎంపికైనట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులను ఉపాధ్యాయులు, స్థానికులు అభినందించారు.

న్యాల్‌కల్ ఉన్నత పాఠశాల నుంచి...

న్యాల్‌కల్(జహీరాబాద్): న్యాల్‌కల్ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థి సద్దాం, మెటల్‌కుంట పాఠశాలకు చెందిన విద్యార్థిని సుస్మితలకు బాసర ట్రిపుల్ ఐటీకి దరఖాస్తు చేసుకోగా ఎంపికైనట్లు ఎంఈఓ మారుతి రాథోడ్ తెలిపారు. ఈ సందర్భంగా ట్రిపుల్ ఐటీలో సీటు సాధించిన విద్యార్థులను ఎంఈఓ అభినందించారు.

మోడల్ స్కూల్ విద్యార్థినుల ఎంపిక

హత్నూర(సంగారెడ్డి): మండల పరిధిలోని గుండ్ల మాచునూర్ మోడల్ స్కూల్ ఇద్దరు విద్యార్థినులు చంద్రిక, మౌనిక బాసర ట్రిబుల్ ఐటీకి ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ శ్రీలక్ష్మి తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థునులను ఉపాధ్యాయులు, సిబ్బంది అభినందించారు.

వెలిమెల తెలంగాణ మోడల్ స్కూల్ విద్యార్థుల ఎంపిక

రామచంద్రాపురం (పటాన్‌చెరు): బాసర ఐఐటీకి రామచంద్రాపురం పరిధిలోని వెలిమెల తెలంగాణ మోడల్ స్కూల్‌కు చెందిన మానస, తేజశ్విని ఎంపికయ్యారు. విద్యార్థులు అత్యధిక జీపీఏ 9.8/10తో మండలంలో అగ్రస్థానంలో నిలిచారని తెలంగాణ మోడల్ స్కూల్, జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ రాంప్రసాద్ తెలిపారు.

పద్మగాయత్రి ప్రతిభ

కల్హేర్(నారాయణఖేడ్): మండల పరిధిలోని దేవునిపల్లికు చెందిన విద్యార్థిని పద్మ గాయత్రి బాసర ట్రిపుల్ ఐటీకి ఎంపికైంది. పద్మగాయత్రి మాసాన్‌పల్లి ఉన్నత పాఠశాలలో 10వ తరగతి చదివింది. 9.8జీపీఏ సాధించడంతో ట్రిపుల్ ఐటీ సీటు వచ్చిందని హెచ్ఎం షఫీఉద్దీన్ తెలిపారు.

ఆక్స్‌ఫర్డ్ ఉన్నత పాఠశాల నుంచి...

జోగిపేట(అందోల్): బాసరలోని ట్రిపుల్ ఐటీకి జోగిపేటలోని ఆక్స్‌ఫర్డ్ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థిని సింధూజ ఎంపికయ్యారు. ఈ సందర్భంగా పాఠశాల డైరెక్టర్ దాసరి నాగేశ్వర్, ప్రిన్సిపాల్ డెలిఫిన్ లెవర్, వైస్ ప్రిన్సిపాల్ నరేందర్, ఉపాధ్యాయులు సింధూజను అభినందించారు.

సంక్షిప్త వార్తలు

◆ నోట్‌బుక్కులు పంపిణీ

జహీరాబాద్: పట్టణంలోని అహ్మద్‌నగర్ కాలనీలో ఉన్న ప్రాథమిక ఉన్నత పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు షేక్‌ఫరీద్ ఉచితంగా నోటుబుక్కులు స్టేషనరీ సామగ్రిని గురువారం విద్యార్థులకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు రాణి, ఉపాధ్యాయులు అలీమ్, మహ్మద్ అలీ తదితరులు పాల్గొన్నారు.

◆ చెరువులో చెత్త తొలగింపు



జోగిపేట(అందోల్): డాక్టర్ శ్యాంప్రసాద్ ముఖర్జీ జన్మదినం సందర్భంగా గురువారం భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో అందోల్ పెద్ద చెరువులోని ప్లాస్టిక్, వ్యర్థాలను తొలగించి చెరువు శుద్ధీకరణ చేపట్టారు. కార్యక్రమంలో ఆ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు ప్రభాకర్‌గౌడ్, సీనియర్ నాయకులు ప్రభాస్ జైస్వాల్, రుద్రారం మానయ్య, సతీష్‌కుమార్, మహేందర్ సుమన్, జగన్నాథం, ఆంజనేయులు, హరీష్ పాల్గొన్నారు.

◆ కాస్మొటిక్స్ పంపిణీ

నారాయణఖేడ్: మున్సిపాలిటీ కార్మికులు మున్సిపల్ శానిటరీ అధికారి గురువారం కాస్మొటిక్స్ పంపిణీ చేశారు. మున్సిపల్ చైర్మన్ ఆనంద్ స్వరూప్‌షెట్కార్, వైస్ చైర్మన్ దారం శంకర్ ఆదేశాల మేరకు పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మున్సిపల్ కార్మికులకు అందజేసే పరికరాలు, కాస్మొటిక్స్ సకాలంలో అందజేస్తున్నట్లు తెలిపారు.

◆ తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేత

పుల్‌కల్(అందోల్): రాష్ట్ర ప్రభుత్వం జాబ్ క్యాలెండర్‌ను విడుదల చేయాలని బీజేవైఎం మండల కమిటీ తహసీల్దార్ క్రిష్ణకు వినతి పత్రం సమర్పించారు. నిరుద్యోగ సమస్యలను పరిష్కరించాలని,గ్రూప్ 2,3లో నోటిఫికేషన్‌లో పోస్టులు పెంచాలని,25 వేలతో మేఘా డీఎస్సీని వేయాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో బీజేవైఎం నాయకులు కార్తీక్ గౌడ్,మహేందర్,నవీన్,శ్రీకాంత్, బాను ప్రసాద్ పాల్గొన్నారు.

◆ పుల్‌కల్ ఎస్ఓగా బాల్‌రాజ్

పుల్‌కల్(అందోల్): పుల్‌కల్ మండల ప్రత్యేక అధికారిగా డీఆర్‌డీఏ అడిషనల్ పీడీ బాల్‌రాజ్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఎంపీపీ పదవీకాలం పూర్తి కావడంతో ప్రభుత్వం ప్రత్యేక అధికారుల పాలన తెచ్చింది. కార్యక్రమంలో ఎంపీడీఓ ఆనంద్‌మేరీ, ఏఈపీఆర్ శశికుమార్, సూపరింటెండెంట్ శ్రీనివాస్, సీనియర్ అసిస్టెంట్ మల్లికార్జున్ పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం పలికారు.